బాబోయ్.. గుంతలు!



కడప - రేణిగుంట హైవేలో రెడ్డిపల్లె వద్ద గుంతలతో వాహనదారుల కష్టాలు (పుల్లంపేట మండలం)

ఇక్కడ కనపడుతున్న ఫొటోల్లో అధ్వానంగా ఉన్న రోడ్ల దుస్థితి.. ఏ గ్రామంలోనిదో అనుకుంటే పొరపాటే. ఇవి కడప – రేణిగుంట జాతీయ రహదారి(716)కి సంబంధించినవి. హైవే పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో వీటిని చూస్తే అర్థమవుతుంది. అంతంత మాత్రంగా ఉన్న హైవే ఇటీవలి వర్షాలకు గుంతలమయమైంది. గతంలో ఎన్‌హెచ్ ఉన్న రోడ్డును ఇటీవల ఎన్‌హెచ్‌ఏఐకి బదిలీ చేసిన తర్వాత హైవేపై మరమ్మతులను పట్టించుకునే నాథుడు కరవయ్యారు. హైవేపై ప్రధానంగా కడప నుంచి కుక్కలదొడ్డి వివిధ ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్డు లేదా భారీ గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ఈ మార్గంలో ప్రయాణిస్తున్న వారి నడుములు గుల్లవతున్నాయి. తరుచూ ప్రమాదాలు కూడా సంభవిస్తున్నాయి. ఇవేవి పట్టని అధికారులు తమకెందుకు అనేలా వ్యవహరిస్తున్నారు. ఈ హైవే ఎప్పుడు బాగు చేస్తారో తెలియకపోవడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా మరమ్మతులు చేపట్టాలని వాహదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

– రాజంపేట



న్యూ బోయనపల్లెలో భారీ అన్నమయ్య విగ్రహం వద్ద జాతీయ రహదారిపై ఏర్పడిన భారీ గుంత (రాజంపేట మండలం)

క్లుప్తంగా

ఉపాధ్యాయుల నిరసన



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఒంటిమిట్ట : రాయచోటిలోని కొత్తపల్లి ఉర్దూ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయుడు ఏజాస్ అహ్మద్ మృతికి మండల పరిధిలోని కొత్తమాధవరం జెడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయులు పాఠశాల బయట శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం నాగలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలలో పారిశుద్ధ్య పనులు



పాఠశాలలో మట్టిని తోలి జేసీబీతో చదును చేయిస్తున్న దృశ్యం

ఓబులవారిపల్లె : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వై.కోట హరిజనవాడ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో వర్షపునీరు చేరి బురదమయంగా మారింది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ మల్లెం ఈశ్వరయ్య శుక్రవారం జేసీబీ సహాయంతో మట్టిని తోలి బురద లేకుండా పనులు చేయించారు.

జాగ్రత్తలతోనే ఎయిడ్స్ రహిత సమాజం

రాయచోటి (జగదాంబసెంటర్) : ఎయిడ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పీసీఎస్‌ఎస్ ప్రాజెక్టు మేనేజర్ టి.స్వాతి అన్నారు. శుక్రవారం రాయచోటి పట్టణం బోసనగర్‌లో ఉన్న సీఎస్ రాజు స్కూల్‌లో వరల్డ్ ఎయిడ్స్ డే వారోత్సవాలు సందర్భంగా హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహనా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఎయిడ్స్ వ్యాధి ఎలా వ్యాపిస్తుంది.. ఎలా వ్యాపించదు.. ఎయిడ్స్ వ్యాధి రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో సీఎస్ రాజు స్కూల్ హెడ్‌మాస్టర్ ఎస్.రమేష్‌రెడ్డి, కో–ఆర్డినేటర్ ఎల్.రెడ్డయ్య, మౌనిక, రాగలిఖిత, ఉపాధ్యాయులు, పీసీఎస్‌ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పాదయాత్రకు సంఘీభావం



పాదయాత్రలో పాల్గొన్న నాయకులు

నందలూరు : రాజంపేట శాసనసభ్యులు ఆకేపాటి అమర్‌నాథరెడ్డి 22వ తిరుమల మహాపాదయాత్రలో బోయనపల్లి వద్ద నందలూరు వైఎస్సార్‌సీపీ నాయకులు గడికోట వెంకటసుబ్బారెడ్డి, అరిగెల సౌమిత్రి చంద్రనాథ్, వైఎస్సార్‌సీపీ నాయకులు హరిబాబు, గీతాల నరసింహారెడ్డి, భాస్కర్ యాదవ్, మాబాషాలు పాల్గొని ఆకేపాటిని శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో సాయినాథుడు

రాజంపేట టౌన్ : మండలంలోని కూచివారిపల్లెలో వెలసి ప్రసిద్ధిగాంచిన షిర్డీ సాయినాథ మందిర వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సాయినాథుని మూలవిరాట్‌ను ఆలయ అర్చకులు హరికుమార్‌శర్మ, శేఖర్‌శర్మ ప్రత్యేక పుష్పాలు, పట్టువస్త్రాలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు.

సేంద్రీయ విధానంలో పండ్ల తోటలు సాగు చేయాలి

కలికిరి : సేంద్రీయ పద్ధతుల్లో కాయకూరలు, పండ్ల తోటలు సాగు చేయాలని బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ కేంద్రం ప్రిన్సిపాల్ టి.హెచ్.సింగ్ అన్నారు. స్థానిక కేవీకే కార్యాలయంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమావేశానికి విచ్చేసిన ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రధానంగా పండించే టమాటా, మామిడి, వంగ, మిరప, బొప్పాయి, దానిమ్మ, అనప, అలసంద, బీన్స్, చిక్కుడు, జామ, సొర, బీర, కాకర, దోస, ఆకుకూరలు తదితర పంటల్లో ఐహెచ్‌ఆర్ రూపొందించిన అధిక దిగుబడినిచ్చే, చీడ పీడలను తట్టుకునే హైబ్రిడ్ విత్తనాల గురించి ఆయన వివరించారు. సేంద్రీయ విధానంలో అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. అనంతరం రైతులకు కూరగాయలు, ఆకుకూరల నూతన రకం విత్తనాలు, మామిడి, డ్రాగన్, జామ, అల్లనేరేడు, నిమ్మ తదితర అంటు మొక్కలను రైతులకు ఉచితంగా అందచేశారు. కార్యక్రమంలో కేవీకే కో–ఆర్డినేటర్ డా. మంజుల, ఐఐహెచ్‌ఆర్ సీనియర్ సైంటిస్ట్ డా. అతికుల్ల, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ అశోక్‌కుమార్‌రెడ్డి, ఉద్యానవన అధికారి సుకుమార్‌రెడ్డి, కేవీకే శాస్త్రవేత్తలు శ్రీనివాసులు, పీరుసాహెబ్, నవీన, మాధురి పాల్గొన్నారు.

రమణీయం.. శ్రీ వేంకటేశ్వరుడి కల్యాణం



వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవంలో ఆకేపాటి, గడికోట

రాజంపేట టౌన్ : ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి తిరుమల మహాపాదయాత్రను పురస్కరించుకొని శుక్రవారం ఆకేపాడులోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన భూదేవి, శ్రీదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణం కమనీయంగా సాగింది. తొలుత కల్యాణ ఉత్సవ మూర్తులను పట్టువస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి వేదికపై కొలువుదీర్చారు. అనంతరం వేదపండితులు వేదమంత్రోచ్ఛరణల నడుమ కల్యాణ క్రతువును శాస్త్రోక్తంగా జరిపించారు. ఈ సందర్భంగా ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, జ్యోతమ్మ దంపతులు, ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి, సుజనమ్మ దంపతులతోపాటు వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డిలచే పురోహితులు ప్రత్యేక పూజలు చేయించారు. స్వామివారి కల్యాణం జరుగుతున్నంత సేపు భక్తులు గోవిందనామ స్మరణ చేశారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు ఆకేపాటి సోదరులు దగ్గరుండి భోజనాన్ని వడ్డించారు.

లోకకల్యాణం కోసమే ఆకేపాటి తిరుమల పాదయాత్ర – గడికోట

ఎమ్మెల్యే ఆకేపాటి లోకకల్యాణం కోసమే ప్రతి ఏడాది తిరుమల పాదయాత్ర చేపడుతున్నారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. కల్యాణం అనంతరం శ్రీకాంత్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. ఆకేపాటి చేపట్టే పాదయాత్రలో ప్రతి ఏడాది తాను పాల్గొంటుండటం ఆ వేంకటేశ్వర స్వామి కృప అని తెలిపారు. పాదయాత్ర దిగ్విజయంగా సాగాలని అలాగే ప్రతి ఒక్కరిపై స్వామి వారి ఆశీస్సులు ఉండాలని శ్రీకాంత్‌రెడ్డి ఆకాంక్షించారు. రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజలు సుభిక్షంగా ఉండాలన్నదే ఆకేపాటి ఆశయమని, అందుకోసమే ఆయన ప్రతి ఏడాది తిరుమల పాదయాత్ర చేపడుతున్నారని తెలిపారు. ఆకేపాటి సంకల్పానికి వేంకటేశ్వర స్వామి ఆశీస్సులు ఉండటం వల్లే రెండు దశాబ్దాలుగా క్రమం తప్పకుండా ఆయన పాదయాత్రను దిగ్విజయంగా కొనసాగిస్తున్నారని తెలిపారు.



ఆకేపాటిని గజమాలతో సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల, కోడూరు నాయకులు

క్రిటికల్ కేర్ యూనిట్ ఏర్పాటు చేస్తాం

రాయచోటి టౌన్ : రాయచోటి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రూ.29.5 కోట్లతో క్రిటికల్ కేర్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. దీని కోసం రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రిలోని వైద్యాధికారులతో సమావేశం నిర్వహించి చర్చించారు. క్రిటికల్ కేర్ యూనిట్ 50 పడకల ఆస్పత్రిగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఆస్పత్రి ఏర్పాటు పూర్తి అయితే అత్యవసర వైద్యం కోసం వచ్చిన వారికి, ప్రమాదాలలో తీవ్రంగా గాయపడిన వారికి అత్యవసర చికిత్స అందించడం జరుగుందన్నారు.

స్కౌట్‌లు రోల్ మోడల్‌గా ఉండాలి

స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు రోల్ మోడల్‌గా ఉంటూ విద్యార్థులలో క్రమశిక్షణ, దేశ భక్తి పెంపొందింపజేసే విధంగా శిక్షణ ఇవ్వాలని రాష్ట్ర మంత్రి రాంప్రసాద్‌రెడ్డి స్కౌట్ మాస్టర్లకు సూచించారు. శుక్రవారం అర్చన కళాశాలలో నిర్వహించిన స్కౌట్, గైడ్స్‌ల ఏడు రోజుల శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. విద్యార్థులలో నాయకత్వ లక్షణాలను పెంపొందింపజేసేలా తీర్చిదిద్దాలని సూచించారు. కాగా స్కౌట్స్ మాస్టర్, కెప్టెన్, క్లబ్ మాస్టర్, లీడర్లు తమకు రూ.3వేల గౌరవ వేతనాన్ని అందించాలని మంత్రిని కోరారు.



మాట్లాడుతున్న మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి

సమన్వయంతోనే సమస్యల పరిష్కారం

రాయచోటి అర్బన్ : అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే ప్రజా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని రాయచోటి రూరల్ మండల అభివృద్ధి అధికారి వెంకటేష్ అన్నారు. శుక్రవారం ఎంపీపీ రాజమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం సర్పంచులు, ఎంపీటీసీలు అధికారులతో కలిసి పనిచేయాలన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, అభివృద్ధి అంశాలలో అధికారులకు ప్రజాప్రతినిధులు సహాయ, సహకారాలు అందించినప్పుడే లక్ష్యం సాధించగలమన్నారు. పీఆర్ ఏఈ సందీప్ మాట్లాడుతూ రూ.80 లక్షలతో చెన్నిముక్కపల్లె గ్రామం దూళ్లవారిపల్లె వంకకు అడ్డంగా నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు త్వరలో పూర్తవుతాయన్నారు. శిబ్యాల – మోపురంపల్లె తారురోడ్డు నిర్మాణం పనులు డిసెంబరు నెలాఖరులోపు పూర్తి చేయించనున్నట్లు తెలిపారు. 9 పల్లెలకు గ్రామ సడక్ యోజన పథకం కింద రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామన్నారు. ఎంఈఓ–2 శివారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకానికి కొత్త మెనూ తీసుకురానున్నట్లు తెలియజేశారు. వ్యవసాయాధికారి దివాకర్ మాట్లాడుతూ రబీలో వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులు ఎక్కువగా ఉలవ పంటను సాగుచేశారన్నారు. ప్రభుత్వం కరవు మండలంగా ప్రకటించిందని, మండలంలో 345 హెక్టార్లలో రూ. 58.71 లక్షల పంట నష్టం జరిగినట్లు నివేదికలు తయారుచేసి ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. పశు వైద్యాధికారి మాట్లాడుతూ పనికి ఆహార పథకంలో భాగంగా ప్రభుత్వం మండలానికి 64 మినీ గోకులం షెడ్లు మంజూరయ్యాయన్నారు. అనంతరం హౌసింగ్, ఐసీడీఎస్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్‌టీసీ, వైద్య ఆరోగ్యశాఖతో పాటు పలుశాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. కార్యక్రమంలో పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ ప్రభుత్వశాఖల మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటేష్

క్లుప్తంగా..

ఆత్మవిశ్వాసమే దివ్యాంగుల బలం

ఒంటిమిట్ట: దివ్యాంగులకు ఆత్మవిశ్వాసమే వారికి ఉన్న బలమని ఒంటిమిట్ట ఎంఈఓ వెంకటసుబ్బయ్య అన్నారు. శుక్రవారం స్థానిక భవితా కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఏకశిలా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధ్యక్షులు వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులకు పలు రకాల పోటీలు జరిపి విజేతలకు బహుమతులు అందజేశారు. అలానే విద్యార్థులకు కమలాపురం ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి ఉచితంగా నూతన దుస్తులను అందజేశారు. జనసేన నాయకులు అతిగారి కృష్ణ విందు భోజనాలు ఏర్పాటు చేశారు.

సత్కారం

రాయచోటి టౌన్ : విద్యార్థులలోని నైపుణ్యాన్ని, విజ్ఞానాన్ని వెలికితీసేందుకు సైన్స్ ఫెయిర్‌లు నిర్వహిస్తున్న డాక్టర్ అబ్దుల్ కలాం ట్రస్ట్ డైరెక్టర్ వినయ్ కుమార్ సేవలు అభినందనీయమని డైట్ ప్రిన్సిపల్ అజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక డైట్ కేంద్రంలో జిల్లాస్థాయి కళా ఉత్సవ్ –2024 నిర్వహణలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వినయ్‌కుమార్‌ను సన్మానించారు.

దళిత, గిరిజనులకు భూమి ఇవ్వాలి

రైల్వేకోడూరు అర్బన్ : అర్హులైన ప్రతి గిరిజన, దళిత కుటుంబాలకు 3 ఎకరాలు భూమి ఇవ్వాలని శుక్రవారం బీకేఎంయూ రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్ కోటేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. పట్టణంలో జరిగిన బీకేఎంయూ కార్యవర్గ సభకు హాజరై మాట్లాడారు. కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

చెరువుకు నీరు తరలించే పనులు ప్రారంభం

నందలూరు : మండలంలోని పాటూరు చెరువుకు చెయ్యేరు నుంచి నీరు తరలించే పనులను శుక్రవారం చేపట్టారు. ఏటి నుంచి చెరువుకు నీరు వచ్చే ఎగువ కాలువ పూడికతీత పనులను ఎక్స్‌వేటర్ సహాయంతో మొదలు పెట్టారు.

మొదటిరోజు మొక్కుబడిగా..

- రైల్వేకోడూరులో రెవెన్యూ సదస్సులో దర్శనమిచ్చిన ఖాళీ కుర్చీలు
- అర్జీల పరిష్కారానికి 45 రోజుల సమయమంటున్న అధికారులు

రైల్వేకోడూరు అర్బన్ : కూటమి ప్రభుత్వం భూ సమస్యలు పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులు మొదటి రోజు మొక్కుబడిగా సాగాయి. శుక్రవారం ఓబనపల్లి పంచాయతీలో నోడల్ ఆఫీసర్ నాగభూషణం, తహసీల్దార్ మహబూబ్‌చాంద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పలువురు ప్రజలు తమ సమస్యలు ఆన్‌లైన్, అడంగల్, పేరు మార్పిడి, పాస్‌పుస్తకాలకు అర్జీలు సమర్పించారు. చిన్న సమస్యలు కూడా అధికారులు 45 రోజుల సమయం పడుతుందని చెప్పడంతో అర్జీదారులు మండిపడుతున్నారు.

గాలివీడులో..

గాలివీడు : మండలంలో నెలకొన్న భూ సమస్యల సత్వర పరిష్కారానికే రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు మండల రెవెన్యూ గ్రామ సభల ప్రత్యేక అధికారి డీఎస్‌ఓ రఘురాం పేర్కొన్నారు. మండలంలోని వెలిగల్లు గ్రామ సచివాలయంలో తహసీల్దార్ భాగ్యలత ఆధ్వర్యంలో రెవెన్యూ గ్రామ సభను నిర్వహించారు.

అర్జీలు అందజేసిన రైతులు

ఓబులవారిపల్లె : మండలంలోని గోవిందంపల్లి పంచాయతీలో శుక్రవారం రెవెన్యూ అధికారులు రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆన్‌లైన్‌కు సంబంధించి, సర్వేకు సంబంధించిన సమస్యలను రైతులు అధికారులకు అర్జీ రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీధర్ రావు మాట్లాడుతూ గ్రామంలో 50 మంది అర్జీలు సమర్పించారన్నారు. వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



రైల్వేకోడూరు అర్బన్: రెవెన్యూ సదస్సులో దర్శనమిస్తున్న ఖాళీ కుర్చీలు

భూసమస్యల పరిష్కారానికే గ్రామసభలు

చిన్నమండెం : మండలంలో నెలకొన్న భూసమస్యల సత్వర పరిష్కారానికి రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు మండల స్పెషల్ ఆఫీసర్ చంద్రానాయక్ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని కలిబండ గ్రామ సచివాలయంలో తహసీల్దార్ నరసింహులు ఆధ్వర్యంలో రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ప్రజల నుంచి 20 అర్జీలు ఆన్‌లైన్, 30 అర్జీలు ఇతర సమస్యలపై వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరసింహులు, డిప్యూటీ తహసీల్దార్ రెడ్డిబాబు, వీఆర్‌ఓ గంగాధర్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నందలూరులో..

నందలూరు : భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోందని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ పేర్కొన్నారు. మండలంలోని పాటూరు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆయన హాజరయ్యారు. ఈ నేపథ్యంలో ప్రజలు నుంచి పలు వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టు కేసులు, ముటేషన్, నదులు, చెరువులు, కాలువ ఆక్రమణలతోపాటు ఇంటి, భూ సమస్యలు పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ సదస్సుల నందు ఎటువంటి రుసుము తీసుకోకుండా అన్ని రెవెన్యూ సర్టిఫికెట్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అక్కిరెడ్డి స్వరూపరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు అక్కిరెడ్డి మోహన్ రెడ్డి, స్పెషల్ ఆఫీసర్ ముజీబ్ బాషా, తహసీల్దార్ అమర్నాథ్, పంచాయతీ సెక్రటరీ మమత, జూనియర్ అసిస్టెంట్ సిద్దిక్, మండల సర్వేయర్ ప్రభాకర్, వీఆర్‌ఓలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



చిన్నమండెం: అర్జీలు స్వీకరిస్తున్న స్పెషల్ ఆఫీసర్ చంద్రానాయక్



నందలూరు: వినతులను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

రాజంపేట రూరల్ : రెవెన్యూ సదస్సులతో సమస్యలు పరిష్కారం కాగలవని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ తెలిపారు. మండలంలోని తాళ్లపాకలో తహసీల్దార్ పీరుమున్నీ ఆధ్వర్యంలో, ఎంజీపురంలో డీటీ లవకుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం రెవన్యూ సదస్సులను నిర్వహించారు. తాళ్లపాకలో జరిగిన రెవెన్యూ సదస్సులో జాయింట్ కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, వారి సమస్యలను తెలుసుకున్నారు. నిర్దిష్ట సమయంలో అర్జీల రూపంలో వచ్చిన సమస్యలను పరిష్కరించనున్నట్లు ఆయన తెలిపారు. కాగా సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన రెవన్యూ సదస్సులు తొలి రోజైన శుక్రవారం మండలంలోని అధికారులు మమ అనిపించారు.

రాష్ట్రంలో రాజ్యాంగాన్ని విస్మరించిన కూటమి

- రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్న ప్రభుత్వం
- రాజ్యాంగ నిర్మాతకు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఘన నివాళి
- రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : దేశంలోని ప్రజలందరూ తమ హక్కులను పొందడానికి అట్టడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని కూటమి ప్రభుత్వం విస్మరించి తమ రెడ్ బుక్ రాజ్యాంగాన్ని రాష్ట్రంలో అమలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక పోలీస్‌స్టేషన్ వద్దనున్న ఆయన కాంస్య విగ్రహానికి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ప్రపంచానికే ఆదర్శమన్నారు. అట్టడుగు, బడుగు, బలహీన వర్గాలకు సమానత్వం కల్పించడానికి, వారి హక్కులను కాపాడటానికి రాజ్యాంగం రూపొందించారని తెలిపారు. కానీ రాజ్యాంగ బద్ధంగా ఎన్నికైన సీఎం చంద్రబాబు నాయుడు, రాజ్యాంగ విలువలకు తూట్లు పొడిచేలా పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. ఇచ్చిన హామీల అమలు ఎప్పుడని ప్రశ్నిస్తున్న వారిపై కేసులు పెడుతూ కక్షసాధింపు చర్యలకు దిగుతోందని తెలియజేశారు. రాష్ట్రంలో భావప్రకటన స్వేచ్ఛను అణచివేసేలా సాగిస్తున్న పాలనను ప్రజలంతా గమనిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కేవలం వైఎస్సార్, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే పేదలకు, బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరిగిందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, జెడ్పీటీసీ రత్నమ్మ, సీహెచ్ రమేష్, మండల నాగేంద్ర, తుమ్మల సురేష్, అన్వర్‌బాషా, మారెళ్ల రాజేశ్వరి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



రైల్వేకోడూరు అర్బన్: రాజ్యాంగ నిర్మాతకు నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే, నాయకులు

మహోన్నత వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

రాజంపేట టౌన్ : అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం కృషి చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మహోన్నతమైన వ్యక్తి అని మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసరెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ దళిత విభాగం ప్రతినిధుల ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని ఆర్ అండ్‌బీ బంగ్లా వద్ద అంబేడ్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ ఎన్.ఈశ్వరయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు జెనుగు కృష్ణారావుయాదవ్, ఏల్పూరు అశోక్, వివిధ విభాగాల ప్రతినిధులు దండు గోపి, దాసరి పెంచలయ్య, ఎల్లయ్య, బొజ్జా పెంచలయ్య, పాపినేని విశ్వనాథరెడ్డి, మిర్యాల సురేఖ, అబ్దుల్ మునాఫ్, జీవీ సుబ్బరాజు, కల్యాణ్‌రెడ్డి, చికెన్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.



రాజంపేట టౌన్: అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు



రాయచోటి అర్బన్: అంబేడ్కర్‌కు నివాళి అర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్, వైఎస్ఆర్‌సీపీ నేతలు

ప్రపంచ మేధావి అంబేడ్కర్


రాయచోటి అర్బన్ : ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ అని మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా అన్నారు. శుక్రవారం వైఎస్ఆర్‌సీపీ జిల్లా కార్యాలయంలో అంబేడ్కర్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వైఎస్ఆర్‌సీపీ నేతలతో కలసి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ ఫయాజుర్ రహిమాన్, వైఎస్ఆర్‌సీపీ నేతలు ఫయాజ్ అహమ్మద్, జానం రవీంద్ర, విజయభాస్కర్, కొలిమి హారూన్‌బాషా, సుగవాసి శ్యామ్‌కుమార్, రియాజుర్ రెహమాన్, మాసాపేట అమీర్ తదితరులు పాల్గొన్నారు.



వీరబల్లి: నివాళులు అర్పిస్తున్న వీఆర్‌డీఎస్ నాయకులు



సిద్దవటం: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి ఉపాధ్యాయుల నివాళి



రాయచోటి అర్బన్: అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నేతలు



సుండుపల్లె: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న వివిధ పార్టీల నాయకులు



గాలివీడు: అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీహెచ్‌పీఎస్ నాయకులు